నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 13 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



విద్యార్థుల ప్రదర్శన

నస్పూర్, డిసెంబర్ 12 : క్రీడలు మానవ జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయని, భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తాయని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన వార్షిక క్రీడోత్సవాలకు ఆయన హాజరై ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం విద్య, ఉపాధి రంగాల్లో క్రీడా కోటాలో రిజర్వేషన్ కల్పిస్తున్నదన్నారు. ప్రతి రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలని, ఆటలు ఆడాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతితో పాటు సంబంధిత అంశాలపై చర్చించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




చెక్కు అందిస్తున్న అటవీ శాఖ డీఆర్వో సరోజా రాణి, అధికారులు

## చెక్కు అందజేత

వాంకిడి, డిసెంబర్ 12 : బండకాసలో రైతు సోయం బాపూరావుకు చెందిన ఆవు గత నెల 24న పులి దాడిలో మృతి చెందింది. ఈ మేరకు ఎఫ్ఆర్వో గోవింద్‌సింగ్ సర్దార్ ఆదేశాల మేరకు డీఆర్వో సరోజా రాణి గురువారం వాంకిడిలో రూ. 20 వేల పరిహారం చెక్కును బాపూరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారి నాగేందర్, సుమిత్ర జంగ్ గ్రామ సభ్యులు తదితరులు ఉన్నారు.

# గజగజ

- ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలపై పంజా విరిసిన చలి
- ఒక్కసారిగా పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఉదయం ఎనిమిదింటి దాకా తొలగని పొగమంచు



సిర్పూర్(యూ)లో చలి మంట కాగుతున్న స్థానికులు

సిర్పూర్(యూ)లో కనిష్ఠంగా **7.3** డిగ్రీలు నమోదు



మంచిర్యాలలో చలి మంట కాగుతున్న యువకులు



బెజ్జూర్‌లో కమ్ముకున్న పొగ మంచులో వాకింగ్ చేస్తున్న యువకులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలపై చలి పంజా విసిరింది. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోగా ప్రజానీకం గజగజ వణికిపోయింది. గురువారం సిర్పూర్(యూ)లో కనిష్ఠంగా 7.3 డిగ్రీలు నమోదు కాగా, గడ్డకట్టుకుపోయే పరిస్థితి తలెత్తింది. ఆయాచోట్ల ఉదయం ఎనిమిది గంటల దాకా పొగమంచు తొలగకపోవడంతో రోడ్లు కనిపించక వాహనాల డ్రైవర్లు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఇక వివిధ పనులపై బయటకు వెళ్లిన వారంతా చీకటి పడకముందే ఇళ్లకు చేరుకోగా, రోడ్లపై సందడి తగ్గింది. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఉదయం.. సాయంత్రం చిన్నా పెద్దలంతా నెగడ్లు వేసుకొని చలి మంటలు కాగుతూ కనిపించారు.

- సిర్పూర్(యూ)/మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్, డిసెంబర్ 13



నిర్మానుష్యంగా మంచిర్యాలలోని ప్రధాన రహదారి

## మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

- మంచిర్యాల డీఈవో యాదయ్య
- కాసిపేటలోని కస్తూర్బా, మోడల్ స్కూల్ తనిఖీ



మోడల్ స్కూల్‌లో భోజనం తింటూ నాణ్యతను పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

కాసిపేట, డిసెంబర్ 12 : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని మంచిర్యాల జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య సూచించారు. గురువారం కాసిపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్‌తో పాటు మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్తూర్బా పాఠశాలలో టీచర్స్, నాన్ టీచింగ్ స్టాఫ్ హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాన్ టీచింగ్ స్టాఫ్ అందరూ విధుల్లో ఉండగా, టీచర్స్‌లో నలుగురు విధుల్లో ఉండగా మిగితా వారు సమ్మెలో ఉన్నట్లు సిబ్బంది డీఈవోకు తెలిపారు. పాఠశాలకు రాకుంటే తప్పనిసరిగా లీవ్ లెటర్ పెట్టాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వంట గదులు, వంట సామగ్రిని పరిశీలించారు. పాడైపోయిన పదార్థాలు వాడవద్దని సిబ్బందికి సూచించారు. అనంతరం మోడల్ స్కూల్‌తో పాటు మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేశారు. స్వయంగా మధ్యాహ్న భోజనాన్ని తిని నాణ్యతను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని సూచించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. డీఈవో వెంట ఎంఈవో ముక్తవరం వెంకటేశ్వర స్వామి ఉన్నారు.



- మంచిర్యాల జిల్లాలో కొనసాగుతున్న 21వ జాతీయ పశుగణన సర్వే
- ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది
- వచ్చే యేడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకూ కొనసాగింపు

# పశుగణన పక్కాగా..

మంచిర్యాల (ఏసీసీ), డిసెంబర్ 12 : పశు సంపద సమగ్ర సమాచారాన్ని తెలుసుకునేందుకు కేంద్ర పశు సంవర్ధక శాఖ చేపడుతున్న 21వ పశుగణన జిల్లాలో కొనసాగుతున్నది. 1919 నుంచి ప్రతి ఐదేళ్లకోసారి పశుసంపదను లెక్కిస్తుండగా, ఈ ఏడాది అక్టోబర్ 25న ప్రారంభమైన ఈ సర్వే.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీతో ముగియనున్నది. సిబ్బంది ఇంటింటా తిరిగి ఆవులు, ఎద్దులు, గేదెలు, దున్నలు, గొర్రెలు, మేకలు, పందులు, ఒంటెలు, గుర్రాలు, గాడిదలు, కుక్కలు, కుందేళ్లు, నాటు, టర్కీ, పౌల్ట్రీ కోళ్లు, బాతులు, ఈము, నిప్పుకోడి తదితర వాటి వివరాలను పక్కాగా సేకరిస్తున్నది. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు వెటర్నరీ, పారా వెటర్నరీ సిబ్బందిని ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లుగా నియమించారు. ఇంటింటికీ వెళ్లి పశువులు, కోళ్లు, పక్షుల వివరాలను సేకరిస్తూ అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

### పశుగణనతో ప్రయోజనాలెన్నో..

జిల్లాలో పశుపోషణపై ఆధారపడి ప్రత్యక్షంగా.. పరోక్షంగా లక్షలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. వ్యవసాయం భారంగా మారడంతో పలువురు రైతులు పంటల సాగుతో పాటు పాడి పశువుల పోషణ కూడా చేస్తున్నారు. ఈ క్రమంలో పశువుల పెంపకం దారులను ప్రోత్సాహించేందుకు, భవిష్యత్తులో వారి ఆదాయాన్ని పెంచేందుకు, రుణాల మంజూరుతో పాటు తదితర పథకాల అమలు కోసం ప్రస్తుతం జరుగుతున్న పశుగణన ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

### జిల్లాలో మేకలు, గొర్రెలు ఎక్కువ..

జిలాలో జోరుగా సర్వే కొనసాగుతున్నది. ఇప్పటి వరకు జిల్లాలో 97 యూసర్ ఐడీలను క్రియేట్ చేశామని, అందులో 90 వరకు పనిచేస్తున్న దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. జిల్లా మొత్తం మీద 561 గ్రామాలు/వార్డులుంటే 54 శాతానికిపైగా సర్వే పూర్తయ్యిందని, రాష్ట్రవ్యాప్తంగా మన జిల్లాలోనే అధికంగా ఈ శాతం నమోదైందని జిల్లా పశు సంవర్ధక అధికారి డా.ఈ శంకర్ తెలిపారు. ఇక 2018లో చేపట్టిన పశుగణన ప్రకారం జిల్లాలో గొర్రెలు అధికంగా ఉన్నాయి. దాదాపు 5.20 లక్షలకుపైగా గొర్రెలు ఉన్నాయని సర్వేలో తేలింది. ఆ తర్వాత మేకలు 1.83 లక్షలు, ఆవులు 1.79 లక్షలు, గేదెలు 1.05 లక్షలు, పౌల్ట్రీ 4.96 లక్షలు, కుక్కలు 12,900, పందులు 2259 అని తేలింది. ఈసారి సర్వేలో సంఖ్యలో మార్పు వచ్చే అవకాశముంటుందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

### పశుగణనకు సహకరించాలి..

పశుగణన పక్కాగా సాగాలంటే ప్రజలు అన్ని విధాలా సహకరించాలి. గ్రామాలే కాకుండా పట్టణాలు, నగరాల్లో కూడా ఈ సర్వే జరుగుతుంది. ఇంటికి వచ్చే పశుసంవర్ధక శాఖ సిబ్బందికి అన్ని వివరాలు తెలియజేయాలి. ఈ సర్వే ద్వారా పాడి పరిశ్రమ పురోగతికి ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

- డా. ఈ శంకర్, జిల్లా పశుసంవర్ధక అధికారి





నెన్నెలలోని కుష్నపల్లి రేంజ్ కార్యాలయం ముందు బైఠాయించిన గ్రామస్తులు

- కోణంపేట గ్రామస్తుల డిమాండ్
- కుష్నపల్లి రేంజ్ కార్యాలయం ఎదుట బైఠాయింపు

## రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకోవద్దు

నెన్నెల, డిసెంబర్ 12 : 'మా ఊరికి రోడ్డు లేక అవస్థలు పడుతున్నాం. అటవీశాఖ అధికారులు పనులను అడ్డుకోవద్దు' అంటూ కోణంపేట గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నెన్నెలలోని కుష్నపల్లి రేంజ్ కార్యాలయం వద్దకు సుమారు 200 మంది చేరుకొని బైఠాయించారు. రెండు గంటల పాటు ఆందోళన చేపట్టారు. దీంతో అటవీ సిబ్బంది, గ్రామస్తుల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో రోడ్డు నిర్మాణానికి రూ. 2.5 కోట్లు మంజూరైనప్పటికీ అటవీశాఖ అనుమతులు లేక పనులు నిలిచిపోయాయని, ఏడాది క్రితం అటవీశాఖ అనుమతులు వచ్చాయని, ఇటీవల కాంట్రాక్టర్ పనులు ప్రారంభిస్తే అధికారులు వచ్చి అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. రోడ్డుపనులు ఆపితే సహించేది లేదని, చెట్లు తీయకున్నా రూ. 64 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం అటవీశాఖకు అందించిందని, అయినా పనులు ఎందుకు అడ్డుకుంటున్నారని గ్రామస్తులు ప్రశ్నించారు. కలెక్టర్, జిల్లా అటవీశాఖ అధికారి వచ్చి తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం రోడ్డు పనులు ఆపకుండా సహకరించాలని కోరుతూ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

## ఖాళీ టీ కప్పులతో నిరసన

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 12 : తమ సమస్యలు పరిష్కరించి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగుల చేపట్టిన నిరసన మూడో రోజుకు చేరింది. గురువారం ఖాళీ టీ కప్పులతో నిరసన తెలుపగా, యూటీఎఫ్ నాయకులు రమేశ్, హేమంత్ షిండే, టీపీఆర్టీయూ నాయకులు మధుకర్, తిరుపతి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు శృతిక, నాగసుధా, తుకారం, మోహన్, నగేశ్ యాదవ్, సంతోష్, నలంద, కవిత, మీనా, రమాదేవి, పవిత్ర, అరుణ, పద్మ, ప్రవీణ, సందీప్, రాజేశ్, పవన్, అనూప్, ప్రశాంత్, వెంకటరమణ, రాము, మల్లేశ్, సత్యనారాయణ, సంతోష్ ఉన్నారు.



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు